క్లుప్తంగా

నేటి నుంచి దస్తగిరయ్య ఉర్సు

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలో నేటి నుంచి దస్తగిరయ్య ఉర్సు జరగనున్నాయి. ఆదివారం గంధోత్సవం, సోమవారం ఉర్సు, మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉర్సు సందర్భంగా వాలీబాల్ పోటీలు, గ్రామస్థాయి ఎద్దుల బండ లాగుడు పోటీలు, స్లో బైక్ రేస్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం చాగదోన గ్రామానికి చెందిన నగేష్‌కు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.18 వేల చెక్కును అందజేశారు.

పిల్లలను కూలీలుగా మార్చొద్దు



రాజోళి: బంగారు భవిష్యత్ ఉన్న పిల్లలను తీసుకెళ్లి కూలీలుగా మార్చవద్దని చైల్డ్ వెల్ఫేర్ ఓఆర్ డబ్ల్యూ లక్ష్మీదేవి అన్నారు. శనివారం మండలంలోని పెద్ద ధన్వాడలో ఉపాధి హామీ కూలీలకు ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో చైతన్యం తీసుకురావడంలో విద్య మాత్రమే కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బాల్య వివాహాలు దూరం చేయడం వల్ల బాలికల భవిష్యత్ బంగారుమయం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు ముస్లిం మత పెద్దలు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. నూతన వస్త్రాలు అందజేస్తున్నట్లు ఎంఐఎం పార్టీ తాలూకా అధ్యక్షుడు కలీముల్లా అన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు మైను, సద్దాం, బాబు, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

వర్క్‌షాపునకు హాజరుకావాలి

గట్టు: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 1న అయిజతో వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి, రాష్ట్ర నాయకుడు గట్టు మారెన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రెప్ప తెలిపారు. అన్ని మండలాల నుంచి ముఖ్యమైన కార్యకర్తలు వర్క్‌షాపుకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

తైబజార్ వేలం ఖరారు



మల్దకల్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎంపీఓ రాజశేఖర్ ఆధ్వర్యంలో సంత తైబజార్ వేలం నిర్వహించారు. వేలంలో ఐదు మంది పాల్గొనగా రూ. 4,13,266కు ఆంజనేయులకు ఖరారు అయినట్లు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహం

ఇటిక్యాల: మండల పరిధిలోని మునుగాలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత ఏడు రోజులుగా నిర్వహించిన భాగవత సప్తాహ కార్యక్రమం శనివారం దిగ్విజయంగా ముగిసింది. ఈ సందర్భంగా శనివారం చిన్నజీయర్ స్వామి శిష్యులు వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి మనిషికి ఆనందం ముఖ్యమని లౌకిక ఆనందం తాత్కాలికం మాత్రమేనని, నిజమైన ఆనందం భాగవత ప్రవచనం ఆలకించడం ద్వారానే అనుభవం పొందగలుగుతారన్నారు. అనంతరం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

సమస్యల వలయంలో పీహెచ్‌సీ

- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధిధికారులు, ప్రజాప్రతినిధులు

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 22ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామానికి దూరంగా ఉండటంతో రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో సరైన వసతులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

అభివృద్ధి నిధులు ఏమవుతున్నాయో

ఆస్పత్రి అభివృద్ధి కోసం వస్తున్న నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన చేతిపంపు చెడిపోయి



మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



గదుల కొరతతో చెట్ల కింద వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ స్వరూపరాణి(ఫైల్)

నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. పూర్తి స్థాయిలో ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు, గొర్రెలు సంచరిస్తూ ఆవరణ మొత్తంను అపరిశుభ్రంగా తయారు చేస్తుండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా వైద్య సిబ్బందికి సరైన వసతి గదులు లేవు. ప్రసూతిగదిలో కూడా సరైన వసతులు లేకపోవడం గమనార్హం. అలాగే ప్రతినెల ఆస్పత్రి ఆవరణలోనే చెట్ల కింద సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.



మల్దకల్ ఆస్పత్రిలో మరమ్మతుకు నోచుకోని ప్రధాన గేటు

పశువులు సంచరిస్తున్నాయి



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రికి వచ్చే రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తున్నాయి. ఉన్నత అధికారులు స్పందించి ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

\- రామాంజనేయులు, మల్దకల్

ఆరుబయట కూర్చోవాల్సి వస్తోంది



ఆస్పత్రిలో రోగులకు సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సీజనల్ కాలంలో అయితే ఎక్కువ సంఖ్యలో రోగులు ఆస్పత్రికి రావడంతో ఇరుకుగా ఉండే గదులతో పాటు ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

\-సవారమ్మ , అమరవాయి

సమస్యలు పరిష్కరిస్తాం



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. సీజనల్ వ్యాధుల సమయంలో ఆస్పత్రికి రోగులు ఎక్కువగా వస్తుండంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం.

\-స్వరూపరాణి, డాక్టర్ మల్దకల్

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

శాంతినగర్: ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు జయలక్ష్మి అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తిమ్మాజిపల్లిలో వృద్ధులు, వితంతువులు, కల్యాణలక్ష్మి అర్హులతో కలిసి శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగాగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలు నెరవేర్చడం లేదని ధ్వజమెత్తారు. నెరవేర్చలేని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి చేతులెత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో నెరవేర్చాలని, లేని పక్షంలో ప్రజల తరఫున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యురాలు జయలక్ష్మి

సేవలు చిరస్మరణీయం



గద్వాల క్రైం: అంకిత భావంతో చేసే సేవలు చిరస్మరణీయమని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ వెంకట్రాములను ఎస్పీ సత్కరించారు. 32 సంవత్సరాలుగా పోలీసు శాఖలో ప్రజలకు సేవలు అందించారన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్‌రావు, వెంకటేష్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మూడెకరాల భూమి ఇవ్వాలి

అయిజ: అంతర్జాతీయ భూమిలేని వ్యవసాయ కూలీల పోరాటదినం సందర్భంగా శనివారం వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సభ్యులు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కార్యదర్శి లావణ్య మాట్లాడారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం 3 ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోవిందమ్మ, జయమ్మ, ప్రశాంతి, కూలీలు పాల్గొన్నారు.

పూలే దంపతుల త్యాగాలు స్మరించుకుందాం

ఎర్రవల్లి: బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన పూలే దంపతుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన కరపత్రాలు విడుదల చేశారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, కుల నిర్మూలన జరుగుతుందని భావించిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. ఏప్రిల్ 11న శాంతినగర్ పట్టణంలో నిర్వహించే మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, దేవన్న, నాగేంద్రం, దేవదాస్, తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలు అందించడానికి కృషి

అలంపూర్: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అయిజ మండలం ఉత్తనూరు గ్రామానికి చెందిన నాగన్నకు రూ. 15,500, బైనపల్లి గ్రామానికి చెందిన మోదీన్‌కు రూ. 13,500, మానవపాడు మండలం కొర్విపాడుకు చెందిన రాములమ్మకు రూ. 34 వేలు, గోకులపాడుకు చెందిన లలితకు రూ. 25,500 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

చెడు స్వభావాన్ని వీడటమే రంజాన్

గట్టు: మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో శనివారం రాత్రి ఏర్పాటు ఇఫ్తార్ విందులో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు విందు ఆరగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సిద్ధిరామప్ప, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: రంజాన్ అంటే ఉపవాస దీక్ష మాత్రమే కాదని మనిషిలోని చెడు స్వభావాలను, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ అని సరస్వతి పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మధుళికారెడ్డి, నందినికేని పాల్గొన్నారు.



మాచర్లలో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

మల్దకల్: నర్సరీల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీఓ రాజశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. నర్సరీల్లో ఎండిన మొక్కల స్థానంలో కొత్తగా విత్తనాలు నాటి వాటిని పెంచాలన్నారు. రోడ్డు వెంట నాటిన మొక్కలకు నీరందించి సంరక్షించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సరీ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

అయిజ: రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి రైతులను నట్టేట ముంచారని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. శనివారం మండలంలోని సింధనూరు గ్రామీణ బ్యాంకు ఎదుట రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. వరంగల్ డిక్లరేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు, పంటలకు గిట్టుబాటు ధర, బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని మండిపడ్డారు. ప్రజల పాలన కాదు ఇది రాబందు పాలన అని ఆరోపించారు. రైతుల పక్షాన పోరాడి ప్రభుత్వం మెడలు వంచి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు దేవేంద్రరెడ్డి, తిమ్మప్ప, దేవేంద్ర, తులసి గౌడ్, జమ్మన్న, రామన్న, రంగన్న, రాజు, ఉరుకుందమ్మ, పార్వతమ్మ, వీరేష్, నరసింహులు, మాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సింధనూరులో బ్యాంక్ ఎదుట నిరసన చేస్తున్న రైతులు

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

మానవపాడు: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ అన్నారు. శనివారం మండలంలోని నారాయణపురం ఎంపీపీఎస్ పాఠశాలలో మహిళ శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలను వేధిస్తే 2012 చట్టం ప్రకారం తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, ర్యాగింగ్, ఆత్మహత్యలు, సైబర్ క్రైమ్స్, టీ సేఫ్ అప్లికేషన్స్ తదితర విషయాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జహీర్, సెక్రటరీ పీఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లీగల్ అధికారి శివ

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

ధరూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్ల కోసం శనివారం ధరూర్‌లో ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా శాఖ జారీ చేసిన కరపత్రాన్ని విడుదల చేశారు. ప్రభుత్వ కళాశాలలో ఉచిత నాణ్యమైన విద్య, ల్యాబ్ సౌకర్యం, స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

మానవపాడు: ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్య బోధిస్తున్నట్లు అధ్యాపకులు బృందం విద్యార్థులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మానవపాడులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

గ్రామ పంచాయతీలను గాలికొదిలేశారు

అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా గ్రామ పంచాయతీలను గాలికొదిలేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని బింగుదొడ్డి గ్రామంలో మహిళలు రహదారిపై నిలిచిన మురుగులో నాట్లువేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ.. అబద్ధపు హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు సంపూర్ణంగా నెరవేర్చడం లేదని మండిపడ్డారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల్లో పాలక వర్గం లేకపోవడంతో పారిశుద్ధ్యం పడకేసిందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకుంటే ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసింహ, సుంకన్న, మహిళలు పాల్గొన్నారు.



మురుగులో నాట్లు వేస్తున్న మహిళలు

కొనసాగుతున్న ‘పది’ పరీక్షలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మూడు కేంద్రాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. శనివారం నిర్వహించిన బయాలజీ పరీక్షకు 409 మంది విద్యార్థులకు గాను 407 మంది హాజరైనట్లు ఫ్లెయింగ్ స్క్వాడ్ విష్ణు తెలిపారు.

ఇటిక్యాలలో వందశాతం హాజరు

ఇటిక్యాల: మండల కేంద్రంలో శనివారం జరిగిన పదో తరగతి పరీక్షకు వంద శాతం విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.



ఉండవెల్లిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

గట్టు/ధరూరు/ఉండవెల్లి/మల్దకల్/రాజోళి/కేటీదొడ్డి/మానవపాడు : గట్టులోని గండి ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకం, పూజలు చేశారు. మాచర్ల గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు.

- ధరూరు మండల పరిధిలోని చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కిష్టచార్యులు శేష వస్త్రాలతో పాటు తీర్థ ప్రసాదాలు ఆమెకు అందజేశారు.
- ఉండవెల్లి మండలంలోని డి.బూడిదపాడు శివారు ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆకు పూజలు నిర్వహించారు. భక్తులు పల్లకిలో సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు.
- మల్దకల్ మండల కేంద్రంలోని ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.
- రాజోళిలోని వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలోని ఆంజనేయ స్వామి మందిరంలో మహిళలు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. తమలపాకులతో ప్రత్యేక చేసి పూజలు నిర్వహించారు.
- కేటీదొడ్డి మండల పరిదిలోని వెంకటాపురంలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవం నిర్వహించారు. కర్ణాటకకు చెందిన ఉప్పేటి గోవింద్ రెడ్డి కల్యాణ మండప నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందజేశారు.
- మానవపాడు మండలంలోని అమరవాయి ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పాగుంట వేంకటేశ్వర ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



అమరవాయిలో అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు



బూడిదపాడులో పల్లకీ సేవలో భక్తులు